10 మంది శిశువుల సజీవ దహనం

- ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఘోర అగ్నిప్రమాదం
- దవాఖాన ఐసీయూలో వ్యాపించిన మంటలు
- 10 మంది మృతి.. 16 మందికి తీవ్ర గాయాలు
- దవాఖానలో కాలం చెల్లిన అగ్నిమాపక పరికరాలు?

అగ్ని ప్రమాదంలో దెబ్బ తిన్న ఎన్ఐసీయూలోని వైద్య పరికరాలు

లక్నో, నవంబర్ 16: ఉత్తరప్రదేశ్‌లో ఘోరం సంభవించింది. ఓ దవాఖానలో జరిగిన అగ్ని ప్రమాదం అంతులేని విషాదాన్ని మిగిల్చింది. నెల రోజుల వయసు కూడా నిండని 10 మంది చిన్నారుల నూరేండ్ల ఆయుష్షును మింగేసింది. సరిగ్గా కళ్లు తెరిచి లోకాన్ని చూడకముందే సజీవ దహనం చేసింది. ఝాన్సీ జిల్లాలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కళాశాల దవాఖానలో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. శుక్రవారం రాత్రి 10.45 గంటల సమయంలో నవజాత శిశువులకు అత్యవసర చికిత్స అందించే నియోనాటల్ ఐసీయూ(ఎన్ఐసీయూ)లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 10 మంది శిశువులు మరణించారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగినప్పుడు ఎన్ఐసీయూలో కనీసం 54 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. దవాఖాన సిబ్బంది, తల్లిదండ్రులు కిటికీలు, తలుపులు పగలగొట్టి కొందరిని రక్షించగలిగారు. కాగా, మరణించిన 10 మంది చిన్నారుల్లో ఏడుగురిని గుర్తించి, పోస్ట్‌మార్టం నిర్వహించారు. మరో ముగ్గురిని గుర్తించడానికి డీఎన్ఏ పరీక్షలు చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

షార్ట్ సర్క్యూటా? నర్సు నిర్లక్ష్యమా?

ఆక్సిజన్ కాన్సెంట్రేటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం సంభవించిందని ప్రాథమికంగా గుర్తించినట్టు యూపీ ఉప ముఖ్యమంత్రి బ్రజేశ్ పాఠక్ చెప్పారు. కాగా, ఓ నర్సు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని భగవాన్ దాస్ అనే ప్రత్యక్ష సాక్షి వెల్లడించాడు. ఆక్సిజన్ సిలిండర్ పైప్‌ను కనెక్ట్ చేస్తున్న సమయంలో పక్కనే ఓ నర్సు అగ్గిపుల్ల వెలిగించడంతో మంటలు వ్యాపించాయని చెప్పాడు. దట్టంగా పొగలు కమ్ముకోవడంతో దవాఖానలో ఉన్న వారు పరుగులు తీశారని, తొక్కిసలాట జరిగి అనేకమంది గాయపడ్డారని పేర్కొన్నాడు. ఈ ఘటనపై మూడంచెల విచారణకు యూపీ ప్రభుత్వం ఆదేశించింది. పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖతో పాటు మెజిస్టేరియల్ విచారణ జరిపిస్తున్నది.

పని చేయని అగ్నిమాపక పరికరాలు?

దవాఖానలో అగ్నిమాపక పరికరాలు సరిగ్గా పని చేయడం లేదని, అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైర్ అలారంలు మోగలేదని స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో మంటలు ఆర్పడంలో ఆలస్యం జరిగిందని, ప్రాణనష్టం పెరిగిందని వెల్లడించాయి. ఘటన జరిగిన వార్డులో 2020లోనే గడువు ముగిసిన అగ్నిమాపక పరికరాలు లభించాయి. అయితే, అగ్నిమాపక పరికరాలు పని చేస్తున్నాయని, ఫిబ్రవరిలోనే దవాఖానలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ జరిగిందని, జూన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించినట్టు బ్రజేశ్ పాఠక్ తెలిపారు.

పిల్లలను చూపించాలని తల్లిదండ్రుల ఆందోళన

దవాఖాన ముందు శనివారం చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దవాఖానలో తమ పిల్లలు చికిత్స పొందుతున్నారని, వారిని చూసేందుకు తమను అనుమతించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. తమ పిల్లలు ఎలా ఉన్నారో తమకు చూపించాలని డిమాండ్ చేశారు. కాగా, అగ్నిప్రమాదం నుంచి సురక్షితంగా రక్షించిన చిన్నారులను దవాఖానలోని మరో యూనిట్‌కు వైద్యులు తరలించారు. ప్రమాదంలో గాయపడ్డవారిని స్థానిక దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని

అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన చిన్నారుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రధాని మోదీ ప్రకటించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడ్డ వారి కుటుంబాలకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్టు యూపీ ప్రభుత్వం ప్రకటించింది.

విషాద వేళ.. డిప్యూటీ సీఎంకు స్వాగతాలా?

ఘటనాస్థలిని పరిశీలించేందుకు దవాఖానకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి బ్రజేశ్ పాఠక్‌కు స్వాగత ఏర్పాట్లు చేయడం వివాదాస్పదమైంది. డిప్యూటీ సీఎం రాకకు ముందు దవాఖాన ప్రాంగణంలో రోడ్డుకు ఇరువైపులా సిబ్బంది ముగ్గుపోశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో రాజకీయ పార్టీలు, నెటిజన్లు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ‘ఓ వైపు చిన్నారులు కాలిపోయి మరణిస్తే.. మరోవైపు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్నారు. ఇది బీజేపీ ప్రభుత్వ కఠినత్వాన్ని చాటుతున్నది’ కాంగ్రెస్ ట్వీట్ చేసింది.

26 నుంచి ఆమరణ నిరాహార దీక్ష

ప్రకటించిన రైతు సంఘాలు

న్యూఢిల్లీ, నవంబర్ 16: కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాలు మరోసారి హెచ్చరికలు జారీ చేశాయి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లను నెరవేర్చకపోతే తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని, ఈ నెల 26 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా శనివారం హెచ్చరించాయి. ఈ సందర్భంగా ఎస్‌కేఎం నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మీడియాతో మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చడానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఫిబ్రవరి 18 నుంచి తమతో ఎలాంటి చర్చలు కూడా జరపలేదని ఆరోపించారు. కేంద్రం తమ డిమాండ్లు తీర్చకపోతే నవంబర్ 26 నుంచి ఖనౌరి బోర్డర్ పాయింట్‌లో ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభిస్తామని చెప్పారు.

ఎస్ఏడీ అధ్యక్ష పదవికి బాదల్ రాజీనామా

చండీగఢ్: శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ వర్కింగ్ కమిటీకి సమర్పించారు. ఆ పార్టీ సీనియర్ నేత దల్జిత్ సింగ్ చీమ వివరాలను వెల్లడించారు. బాదల్ మతపరమైన అపరాధాలు చేసినట్లు అకల్ తఖ్త్ జతేదార్ రెండు నెలల క్రితం తెలిపారు. ఎస్ఏడీ, ఆ పార్టీ ప్రభుత్వం 2007-2017 మధ్య ఈ అపరాధాలు చేసినట్లు వివరించారు. తన నేరానికి శిక్ష విధించాలని ఆయన కోరినప్పటికీ అకల్ తఖ్త్ జతేదార్ స్పందించలేదు.

ప్రభుత్వ పదవి ఇస్తామని..

దిశా పటాని తండ్రికి టోకరా!

25 లక్షలు మోసం

న్యూఢిల్లీ, నవంబర్ 16: ప్రభుత్వంలో ఉన్నతమైన పదవి (నామినేటెడ్ పోస్ట్) ఇప్పిస్తామంటూ ఓ ముఠా బాలీవుడ్ నటి దిశా పటాని తండ్రి జగదీశ్ పటానీని మోసం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు వ్యక్తుల ముఠా ఆయన నుంచి రూ.25లక్షలు తీసుకొని, ఆ తర్వాత మొహం చాటేసింది. దీనికి సంబంధించి ఉత్తరప్రదేశ్ పోలీసులు ఐదుగురు వ్యక్తులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. నిందితులెవ్వరినీ పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. ఉత్తరప్రదేశ్ బరేలీకి చెందిన జగదీశ్ పటానీ, డీఎస్పీగా పనిచేసి రిటైర్ అయ్యారు. అక్కడి ప్రభుత్వంలో అత్యున్నత పదవి ఇప్పిస్తామన్న నిందితుల మాటలను గుడ్డిగా నమ్మి వారికి రూ. 25 లక్షలు సమర్పించుకున్నారు.

మూడు దేశాల పర్యటనకు

ప్రధాని మోదీ

నైజీరియా, బ్రెజిల్, గయానాల్లో 5 రోజుల టూర్

న్యూఢిల్లీ: మూడు దేశాల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ శనివారం భారత్ నుంచి బయలుదేరారు. నవంబర్ 21 వరకు నైజీరియా, బ్రెజిల్, గయాన దేశాల్లో ఐదు రోజుల పాటు పర్యటిస్తారు. బ్రెజిల్‌లో జరిగే జీ20 శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతారు. తొలుత నైజీరియాకు వెళ్లి అక్కడి నుంచి బ్రెజిల్, గయానాల్లో పర్యటిస్తారని ప్రధాని కార్యాలయం తెలిపింది. పశ్చిమ ఆఫ్రికాలో సన్నిహిత భాగస్వామి అయిన నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఆ దేశంలో తొలిసారిగా ప్రధాని పర్యటించనున్నారు. అక్కడ నివసిస్తున్న భారతీయులను ఆయన కలుసుకుంటారు. 50 ఏండ్ల తర్వాత భారత ప్రధాని గయానాలో పర్యటించటం గమనార్హం.

స్పేస్ ఎక్స్ రాకెట్‌తో జీశాట్-ఎన్2 ప్రయోగం

న్యూఢిల్లీ: అమెరికా బిలియనీర్ ఎలాన్ మస్క్ రాకెట్ తయారీ సంస్థ స్పేస్-ఎక్స్‌కు చెందిన ‘ఫాల్కన్-9’ రాకెట్‌తో ఇస్రో ఓ కమ్యునికేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపించనున్నది. స్పేస్-ఎక్స్ రాకెట్‌ను ఉపయోగించి ఇస్రో చేపడుతున్న తొలి అంతరిక్ష వాణిజ్య ప్రయోగమిది. భారత్‌లో విమానాల్లో ఇంటర్నెట్ సేవల కోసం జీశాట్-ఎన్2 అనే శాటిలైట్‌ను పంపుతున్నట్టు శనివారం మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం భారత గగనతలంలో ప్రయాణించే విమానాల్లో ఇంటర్నెట్ సేవలు నిషిద్ధం. అయితే నవంబర్ 4న నిబంధనల్లో భారత్ మార్పులు చేసింది. విమానాల్లో ఇంటర్నెట్ సేవల కోసం 4,700 కిలోగ్రాముల బరువున్న జీశాట్-ఎన్2ను అంతరిక్షంలోకి పంపేందుకు స్పేస్-ఎక్స్ రాకెట్‌ను ఎంచుకుంది!

ఐదుగురు మావోయిస్టుల మృతి

ఇద్దరు జవాన్లకు గాయాలు • ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర ఏజెన్సీ ప్రాంతంలో తుపాకుల మోత మోగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య శనివారం జరిగిన భీకర పోరులో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల్లో మావోయిస్టులు సమావేశమయ్యారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. మరోవైపు మావోయిస్టు పార్టీ నేత అభయ్ ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో భారీ ప్లీనరీ నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో బీఎస్ఎఫ్, ఎస్టీఎఫ్, డీఆర్జీ బలగాలతోపాటు మహారాష్ట్ర సీ-60 బలగాలు సైతం కూంబింగ్ చేపట్టాయి. నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దులోని మాడ్ అడవుల్లో ఛత్తీస్‌గఢ్ భద్రతా దళాలు శనివారం ఉదయం కూంబింగ్ నిర్వహిస్తుండగా వారికి తారసపడ్డ మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగాయి. ఇరువర్గాల మధ్య సుమారు గంటపాటు భీకర పోరు కొనసాగింది. మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరుపుతూనే అడవిలోకి పారిపోయారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారి ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు కాంకేర్ జిల్లా ఎస్పీ ఇంద్ర కళ్యాణ్ వెల్లడించారు.

భారత్‌కు 1400కు పైగా పురాతన వస్తువులు

తిరిగి అప్పగించనున్న అమెరికా

న్యూయార్క్, నవంబర్ 16: రూ.84 కోట్ల విలువైన సుమారు 1440 పురాతన వస్తువులు, విగ్రహాలను భారత్‌కు తిరిగి ఇవ్వనున్నట్లు అమెరికాలోని మన్‌హట్టన్ డిస్ట్రిక్ట్ అటార్నీ అల్విన్ ఎల్.బ్రాగ్ జూనియర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చేపట్టిన దర్యాప్తులో వీటిని స్వాధీనం చేసుకున్నట్టు, ఇందులో అక్రమ రవాణాదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సుభాష్ కపూర్, నాన్సీ వినర్‌ల నుంచి సేకరించినవీ ఉన్నాయని తెలిపారు. వీటిని భారత రాయబార కార్యాలయ అధికారి మనీశ్ కుల్హరికి అందజేస్తామని చెప్పారు. భారత్‌కు అప్పగించనున్న పురాతన వస్తువుల్లో మధ్యప్రదేశ్‌లోని ఒక ఆలయం నుంచి దోచుకున్న ఇసుకరాయితో చేసిన అందమైన నృత్యకారిణి శిల్పం, రాజస్థాన్‌లోని తానెసరా-మహదేవ గ్రామం నుంచి అపహరించిన తానెసర్ మాతృ దేవతా విగ్రహం ఉన్నాయి.

10 నిమిషాలకు మించి

టాయిలెట్‌లో కూర్చోవద్దు!

వైద్య నిపుణుల హెచ్చరికలు

న్యూయార్క్: టాయిలెట్‌లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడం... ఫోన్‌లో మునిగిపోయి ఎక్కువసేపు అందులోనే కూర్చోవడం... ఇటీవలి కాలంలో చాలామందికి అలవాటుగా మారుతున్నది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. టాయిలెట్‌లో 10 నిమిషాలకు మించి కూర్చోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెప్తున్నారు. ముఖ్యంగా మొలల వ్యాధి ముప్పు పెరుగుతుందని, కటి కండరాలు బలహీనంగా మారతాయని టెక్సాస్ యూనివర్సిటీ సౌత్‌వెస్టన్ మెడికల్ సెంటర్ కోలోరెక్టల్ సర్జన్ డాక్టర్ లై క్సూ హెచ్చరిస్తున్నారు. సగటున 5 - 10 నిమిషాలకు మించి టాయిలెట్‌లో ఉండొద్దని న్యూయార్క్‌లోని స్టోని బ్రూక్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫరా మన్సూర్ సూచించారు. టాయిలెట్ కమోడ్‌పై ఎక్కువసేపు కూర్చోవడం వల్ల రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుందని, దీంతో పాయువు, దిగువ పురీషనాళం చుట్టూ ఉండే సిరలు, రక్తనాళాలు పెద్దవిగా మారి మొలలు ఏర్పడతాయన్నారు.

త్వరలో తియ్యని టమాటాలు

బీజింగ్: చైనా శాస్త్రవేత్తలు టమాటాలకు మరింత తియ్యదనం వచ్చేలా చేశారు. సుగర్ కంటెంట్‌ను నియంత్రించే రెండు జన్యువులను తొలగించడం ద్వారా దీన్ని సాధించారు. తాము పరివర్తన చేసిన టమాటాలలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, తాము ప్రయోగాలకు ఉపయోగించిన టమాటాల్లో ఉన్నదాని కన్నా 30% ఎక్కువని చెప్పారు. బరువు, దిగుబడి యథాతథంగానే ఉన్నట్లు తెలిపారు. ఈ కొత్త రకం టమాటాలు సమీప భవిష్యత్తులోనే అందుబాటులోకి రానున్నాయి.

94 ఏండ్లలో 9 చుక్కలు!

క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియా శాస్త్రవేత్త థామస్ పార్నెల్ ఓ ప్రయోగం ప్రారంభించి 94 ఏండ్లు అవుతున్నా ఇంకా కొనసాగుతున్నది.పిచ్ అనే ఒక ప్రత్యేక ద్రవాన్ని గరాటులో బోర్లించడమే ఈ ప్రయోగం. ఇది ఘనరూపంలో ఉన్నట్టు కనిపించే ద్రవ పదార్థం. ఇది నీటి కంటే 100 బిలియన్ రెట్లు, తేనె కంటే 20 లక్షల రెట్లు జిగటగా ఉంటుంది. ఈ ద్రవాన్ని వేడి చేసి చల్లార్చిన తర్వాత 1930లో ఒక గరాటులోకి బోర్లించారు. అయితే, దీని జిగట స్వభావం కారణంగా ఒక్కో చుక్క గరాటులో పడటానికి ఏండ్లు పడుతున్నది. 94 ఏండ్లలో 9 చుక్కలు మాత్రమే పడ్డాయి.

మానవులు అంతరించిపోతే.. ఆక్టోపస్‌దే ఆధిపత్యం!

న్యూఢిల్లీ: మానవుల మనుగడకు అన్ని వైపుల నుంచి ముప్పు ఎదురవుతున్నది. వాతావరణ మార్పులు, ఏఐ వంటివి మానవుల ఉనికికి హాని కలిగించబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ భూమిపై ఆధిపత్యం ఎవరిది? అనే ప్రశ్నపై కొందరు శాస్త్రవేత్తలు పరిశీలన జరిపారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టిమ్ కౌల్సన్ తెలిపిన వివరాల ప్రకారం, ఆక్టోపస్ ఈ భూమిపై ఆధిపత్యం సాధించగలదు. ఆక్టోపస్‌లు పరస్పరం భావ వ్యక్తీకరణ చేసుకోగలవు. ఇవి చాలా తెలివైనవి. పరిస్థితులకు తగినట్లుగా తమను తాము మలచుకోగలవు. దేనినైనా ఉపయోగించుకోగలిగే సామర్థ్యం కలవి. వాస్తవ, వర్చువల్ వస్తువుల మధ్య తేడాను గుర్తించగలవు. తమ చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించగలవు. లోతైన సముద్రాల్లోనూ, తీర ప్రాంతాల్లోనూ జీవించగలవు. ప్రపంచంపై ఆధిపత్యం సాధించడంలో వీటిని ఈ లక్షణాలు ముందు వరుసలో నిలుపుతాయి అని కౌల్సన్ వివరించారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

- ఆరుగురు మైతీ మహిళలు, చిన్నారుల మృతదేహాలు లభ్యం
- రాష్ట్రంలో వెల్లువెత్తిన నిరసనలు
- మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి
- ఇంటర్నెట్ బంద్, కర్ఫ్యూ విధింపు

ఇంఫాల్‌లో రోడ్లపై టైర్లు కాలుస్తూ ఆందోళనకారుల నిరసన

ఇంఫాల్, నవంబర్ 16: బీజేపీ పాలిత మణిపూర్ మరోసారి భగ్గుమంది. గత ఏడాదిన్నరకు పైగా జాతుల వైరంతో రగులుతున్న రాష్ట్రంలో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల మైతీలకు చెందిన 10 మంది మహిళలు, చిన్నారులను కుకీ వర్గీయులు అపహరించుకుపోయారు. అయితే వారిలో ఆరుగురు మహిళలు, చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మణిపూర్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు పెల్లుబికాయి. ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. రోడ్లపై టైర్లను కాలుస్తూ రాకపోకలకు అంతరాయం కలిగించారు. పలు చోట్ల దుకాణాలు, మార్కెట్లను మూసివేశారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకారులు ఇంఫాల్‌లో ఉన్న ముగ్గురు మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల గృహాలను ముట్టడించి ఆస్తులను ధ్వంసం చేశారు. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్యే సపమ్ నిశికాంత సింగ్ ఆ సమయంలో గృహంలో లేకపోవడంతో ఆయనకు చెందిన స్థానిన దినపత్రిక కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. దీంతో శనివారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ వెస్ట్, ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్, కక్చింగ్, కంగ్‌పోక్పీ, చురాచాంద్‌పూర్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను రెండు రోజుల పాటు నిలిపివేశారు. తొలుత జిరి నది వద్ద శుక్రవారం సాయంత్రం మూడు మృతదేహాలు, బారక్ నదీ ప్రాంతంలో శనివారం మరో మూడు మృతదేహాలు కన్పించాయి. ఆ ఆరు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంపారు.

అసలేం జరిగిందంటే..

ఇటీవల కుకీ మిలిటెంట్లు, సీఆర్‌పీఎఫ్ దళాలకు మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకోగా, 10 మందిని భద్రతా దళాలు హతమార్చాయి. ఈ ఘటన అనంతరం జిబ్రామ్‌లోని బోరోబెక్రాలో ఒక మహిళ, ఆమె ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు మైనర్ మనవలు సహ మైతీలకు చెందిన 10 మంది కన్పించకుండా పోయారు. వీరిని కుకీలే అపహరించుకుపోయారని ఆరోపణ. జూన్‌లో మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనల అనంతరం మైతీలకు చెందిన చాలామంది మహిళలు, పిల్లలు బోరోబెక్రా పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలలో ఉంటున్నారు. సోమవారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేసిన కొందరు సాయుధులైన కుకీ మిలిటెంట్లు ఈ శిబిరాలలోని వారిని అపహరించుకుపోయారని పలు సంస్థలు ఆరోపించాయి.

ఇక వారానికి 24 గంటలే పని

విదేశీ విద్యార్థులకు కెనడా పరిమితులు

ఒట్టావా: అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశంపై నిబంధనల్ని కఠినతరం చేస్తున్న కెనడా, తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. క్యాంపస్ బయట అంతర్జాతీయ విద్యార్థుల పనిగంటల్ని వారానికి 24కు పరిమితం చేయాలన్న ప్రతిపాదనను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఆ దేశ వలసలు, శరణార్థులు, పౌరసత్వం శాఖ మంత్రి మార్క్ మిల్లర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది మొదట్లో చేసిన ప్రతిపాదనల ప్రకారం కొత్త నిబంధనావళి అమల్లోకి తీసుకొచ్చినట్టు ప్రకటించారు. దీంతో భారత్ సహా వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ విద్యార్థులు క్యాంపస్ బయట వారానికి కేవలం 24గంటలు మాత్రమే పనిచేయడానికి అవకాశముంటుంది. అంతేగాక..ఒక విద్యా సంస్థ నుంచి మరో విద్యా సంస్థకు మారాలనుకునే ముందు, విద్యార్థులు కొత్త స్టడీ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నిబంధనలు పేర్కొన్నాయి. స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ విధానాన్ని కూడా కెనడా ఇటీవల రద్దు చేసింది. ఈ మార్పులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఆ దేశానికి వెళ్లిన భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

అంతరిక్షంలో చేపల పెంపకం

బీజింగ్, నవంబర్ 16: అంతరిక్ష ప్రయోగాల్లో చైనా వ్యోమగాములు కొత్త రికార్డును సృష్టించారు. మొదటిసారిగా రోదసిలో చేపలను పెంచారు. నవంబర్ 4న ముగిసిన షెన్‌జౌ-18 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని జరిపారు. అంతరిక్షంలోని ప్రతికూల వాతావరణంలో జలచరాల మనుగడ సాగించగలవా అనేది తెలుసుకునేందుకు ఈ ప్రయోగం చేపట్టారు. ఇందుకోసం మనుషుల జన్యువులతో కొంత పోలి ఉండే, త్వరగా పెరిగే జీబ్రాషిఫ్‌లను ఎంచుకున్నారు. నాలుగు జీబ్రాషిఫ్‌లను చైనా అంతరిక్ష కేంద్రంలోకి తీసుకెళ్లి, అక్కడ ఓ అక్వేరియంలో పెంచారు. పెరగడం నుంచి పునరుత్పత్తి వరకు 43 రోజుల్లో వీటి పూర్తి జీవచక్రం అంతరిక్షంలోనే పూర్తయ్యింది. అంతరిక్ష జీవశాస్త్రంలో ఇది కీలక మైలురాయి అని చైనా పరిశోధకులు పేర్కొన్నారు.

హోమ్‌వర్క్‌లో సాయమడిగితే.. చనిపొమ్మన్న చాట్‌బాట్

న్యూఢిల్లీ, నవంబర్ 16: తన హోమ్ వర్క్‌లో సాయం చేయమని అడిగిన ఓ అమెరికా విద్యార్థికి గూగుల్ ఏఐ చాట్‌బాట్ నుంచి ఊహించని చేదు అనుభవం ఎదురైంది. ‘దయ చేసి చచ్చిపో’ అని అది ఆ విద్యార్థిని ప్రోత్సహించడంతో షాక్ తినడం అతడి వంతైందని సీబీఎస్ న్యూస్ వెల్లడించింది. మిషిగన్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి విధయ్ రెడ్డి(29) తన హోమ్ వర్క్‌లో సాయం చేయమని ‘జెమిని’ని కోరినప్పుడు ఈ స్పందన వచ్చింది. ‘మీరు సమయాన్ని, వనరులను వృథా చేస్తున్నారు. మీరు సమాజానికి భారం. ఈ భూమిపై మీరొక మురుగు కాలువ. ఈ విశ్వానికి మీరొక మరక. దయచేసి చావండి’ అని ఆ చాట్‌బాట్ హెచ్చరిక సందేశాన్ని ఇచ్చింది. ఈ ఘటనతో కృత్రిమ మేధ వల్ల కలిగే ప్రమాదాలపై మరోసారి ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనపై గూగుల్ స్పందిస్తూ ఇలాంటి స్పందనలు భవిష్యత్తులో రాకుండా నిరోధిస్తామన్నది.

హెచ్ఐవీకి త్వరలో టీకా!

న్యూఢిల్లీ: ఎయిడ్స్ వ్యాధికి దారి తీసే హెచ్ఐవీ వైరస్‌ను నయం చేసే టీకాను అభివృద్ధి చేసినట్లు హాంకాంగ్‌లోని బయోటెక్ స్టార్టప్ కంపెనీ ఇమ్యునో క్యూర్ ప్రకటించింది. ఇటీవలి క్లినికల్ ట్రయల్స్‌లో సత్ఫలితాలు కనిపించాయని, ఈ టీకాను రోగులకు ఇవ్వడానికి మరో ముందడుగు పడిందని తెలిపింది. షెన్‌జెన్ థర్డ్ పీపుల్స్ హాస్పిటల్‌లో 45 మంది రోగులపై ఈ పరీక్షలు జరిగినట్లు వివరించింది. సంప్రదాయ టీకాలు రోగ నిరోధకంగా ఉపయోగపడతాయని, తాము థెరప్యూటిక్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశామని చెప్పింది. ఇన్ఫెక్షన్ సోకిన తర్వాత థెరప్యూటిక్ వ్యాక్సిన్‌ను ఇచ్చి, రోగాన్ని నయం చేయవచ్చునని వెల్లడించింది. తమ వ్యాక్సిన్‌ను తీసుకున్నవారిలో అత్యధికులకు టీ-సెల్స్ (తెల్ల రక్త కణాలు) స్పందనలు రెట్టింపు అయ్యాయని తెలిపింది.

దేశంలోనే తొలి మహిళా డిపో ఢిల్లీలో ప్రారంభం

న్యూఢిల్లీ: అందరూ మహిళలే పనిచేసే బస్ డిపో దేశంలోనే తొలిసారిగా రాజధాని ఢిల్లీలో ప్రారంభమైంది. సఖి డిపో పేరున ఏర్పాటు చేసిన సరోజినీనగర్ డిపోను రవాణా శాఖ మంత్రి కైలాశ్ గెహ్లాట్ శనివారం ప్రారంభించారు. ఈ డిపోలో సుమారు 225 మంది సిబ్బంది అంతా మహిళలే ఉంటారు. రవాణా రంగంలో మహిళా బస్‌డ్రైవర్లు, కండక్టర్లు తమ హక్కులు, అర్హతల సాధనలో వేసిన ముఖ్యమైన అడుగని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పిల్లల్లో మెదడు క్యాన్సర్‌కు కార్ టీ సెల్ చికిత్స

న్యూఢిల్లీ: పిల్లల్లో మెదడు క్యాన్సర్‌కు కార్ టీ సెల్ చికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చినట్టు క్లినికల్ ట్రయల్స్‌లో తేలింది. ఈ చికిత్స కణితులను తగ్గించడమే కాకుండా పలువురు రోగుల్లో నాడీ జీవ సంబంధ విధులను పునరుద్ధరించింది. ఓ యువ రోగిలో నయం కాని డిఫ్యూస్ ఇంట్రిన్సిక్ పాంటైన్ గ్లియోమా అనే క్యాన్సర్ జాడలను తొలగించింది. స్టాన్‌ఫర్డ్ మెడిసిన్‌లో చేసిన ట్రయల్స్‌లో 11 మందిలో 9 మంది కణితుల పరిమాణం తగ్గింది.

రష్యా ‘ఆపరేషన్ ఫాల్స్ టార్గెట్’

- డెకాయ్ డ్రోన్లతో ఉక్రెయిన్‌ను ఏమార్చే ఎత్తుగడ
- థెర్మోబేరిక్ డ్రోన్లకు రక్షణగా ప్రయోగించే వ్యూహం
- రాడార్లకు చిక్కకుండా టార్గెట్‌ను చేరేలా ప్లాన్

కీవ్, నవంబర్ 16: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా కొత్త ఎత్తుగడలు వేస్తున్నది. 22 నెలలుగా కొన‘సాగుతున్న’ యుద్ధం గేరు మార్చే వ్యూహాలు రచిస్తున్నది. ఉక్రెయిన్ బలగాలను ఏమార్చి టార్గెట్‌ను రీచ్ కావాలని ప్రయత్నిస్తున్నది. ఉక్రెయిన్ రాడార్లకు, యాంటీ మిసైల్ వ్యవస్థకు చిక్కకుండా ప్రమాదకర థెర్మోబేరిక్ బాంబు(వాక్యూమ్ బాంబు)లను వినియోగించేందుకు డెకాయ్ డ్రోన్లను వాడుకోనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకోసం అలబుగా సెజ్‌లోని ఓ కర్మాగారంలో పెద్ద ఎత్తున డెకాయ్ డ్రోన్లను తయారుచేస్తున్నట్టు అసోసియేటెడ్ ప్రెస్(ఏపీ) గుర్తించింది. ఒక రకంగా చెప్పాలంటే డెకాయ్ డ్రోన్లు.. బొమ్మ డ్రోన్ల లాంటివి. బాంబులను మోసుకొస్తున్నట్టుగా వీటిని తయారుచేసి ఉక్రెయిన్‌పైకి రష్యా పంపిస్తున్నట్టు ఏపీ కథనం పేర్కొన్నది.

థెర్మోబేరిక్ బాంబుతో పెను విధ్వంసం

ఈ కర్మాగారంలో వందలాది డెకాయ్ డ్రోన్లతో పాటు థెర్మోబేరిక్ డ్రోన్లను బయటకు తీస్తున్నారని ఏపీ కథనం వెల్లడించింది. థెర్మోబేరిక్ బాంబులను వాక్యూమ్ బాంబు అంటారు. ఆక్సీజన్, ఇంధనాన్ని వినియోగించి ఇది భారీ పేలుడు సృష్టిస్తుంది. ఇది పేలినప్పుడు ఒక భారీ మేఘం ఏర్పడి, దాని పరిధిలో పెను విధ్వంసం జరుగుతుంది. అణుయేతర బాంబులన్నింటిలో ప్రమాదకరమైన బాంబుగా దీనిని భావిస్తారు. థెర్మోబేరిక్ డ్రోన్లతో పాటు పెద్ద ఎత్తున డెకాయ్ డ్రోన్లను ప్రయోగించి రాడార్లను గందరగోళపర్చడం, డెకాయ్ డ్రోన్లకు లైవ్ ఫీడ్ కెమెరాలను ఏర్పాటు చేసి ఉక్రెయిన్ యాంటీ మిస్సైల్ వ్యవస్థను గుర్తించి దాడి చేయడం రష్యా లక్ష్యాలని తెలుస్తున్నది.

యూకే వర్సిటీలకు భారతీయ

విద్యార్థులు దూరం

తాజా సర్వేలో వెల్లడి

లండన్: యూకే యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్టు తాజా సర్వే వెల్లడించింది. బ్రిటన్‌లో ఆర్థిక సంక్షోభం వల్ల అక్కడి విద్యాసంస్థలు బడ్జెట్‌ను నియంత్రించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత విద్యార్థులు అక్కడి వర్సిటీల్లో చేరేందుకు విముఖత చూపుతున్నట్టు సర్వే పేర్కొంది. 2022-23లో 1,39,914 మంది భారత విద్యార్థులు బ్రిటన్ యూనివర్సిటీల్లో దరఖాస్తు చేసుకోగా 2023-24లో ఆ సంఖ్య 20.4 శాతం తగ్గి 1,11,329కి పడిపోయింది. కొన్ని నగరాల్లో ఇమ్మిగ్రేషన్ వ్యతిరేక అల్లర్లు, పరిమిత ఉద్యోగాల నేపథ్యంలోనే భారత విద్యార్థుల రాక తగ్గుతున్నట్టు సమాచారం.